

మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. ఝాన్సీ

వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వాలు ఆదుకోవాలి

రాంనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) నేతలు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో పీవోడబ్ల్యూ 7వ మహాసభలు జరిగాయి. మహాసభలో పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు జి. ఝాన్సీ ఉపాధ్యక్షురాలు అనసూయ, ప్రధాన కార్యదర్శి అందె మంగళప్రద, డాక్టర్ సరిత పిట్ల, జ్యోతి, సీత, గీత తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై హింస గతం కంటే 6 శాతం పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై హింసకు కారణమైన అశ్లీల సంస్కృతి, మద్యం, మనువాద భావజాలాన్ని నిషేధించాలని, మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా ఉద్యమం చేయాలన్నారు. ఇటీవల ఆదివాసీల పోరాటాలను పాలకులు నిర్బంధించడాన్ని ఖండించారు. మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్మిక రంగంలో సమాన పనికి సమాన వేతనం, పనిచేసే చోట్ల క్రెచ్‌లను ఏర్పాటు చేయాలని, మహిళా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

'రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి'

రాంనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె. రంగయ్య, వి. ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో లక్షలాది ఎకరాల్లో ఇసుక మేట వేసిందని, నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ. 25 వేల నష్టపరిహారం, వరి పంటకు రూ. 25 వేలు, వాణిజ్య పంటకు రూ. 50 వేలు, ప్రాణనష్టం జరిగిన కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు.

ఇంటింటి జ్వర సర్వే నిర్వహించండి


డాక్టర్ మనోజ్‌రెడ్డితో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి వెంకటి

ముషీరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (యూపీహెచ్‌సీ) జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజూ ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య, అందిస్తున్న సేవలపై యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ వెంకటి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ఇంటింటి జ్వరం సర్వే నిర్వహిస్తూ ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

సర్పంచ్‌లకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని, వారికి రావాల్సిన పెండింగ్ బకాయిలు వెంటనే చెలించాలని గ్రామపంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు, రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ కో-కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. సోమవారం కవాడిగూడలో న్యాయవాదుల జేఏసీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేసిన సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి 8 నెలలు కావస్తున్నా వారికి బిల్లులు చెల్లించలేదన్నారు. ఈ విషయాన్ని సర్పంచ్‌లు.. అధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం దారుణమన్నారు.

'ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు రక్షణ కల్పించాలి'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ నాగేశ్వర్‌కు రక్షణ కల్పించాలని, ఆయనను బెదిరించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు.


విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాకేష్

ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన

ముషీరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని బైబిల్ హౌస్ పట్టణ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం (యూపీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సూచించారు. సోమవారం భోలక్‌పూర్‌లోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో విద్యార్థినులకు ఆరోగ్యంపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీజనల్ వ్యాధులపై సమావేశం నిర్వహించారు. డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ భానుప్రియ, ఏఎన్ఎం లక్ష్మీబాయి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ అసోసియేషన్

మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా ఉప్పల శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా నియమితులయ్యారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పుల్లెల గోపీచంద్ ఆయనకు నియామకపత్రం అందజేశారు.

'వరదనీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా'

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో వరదనీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ చర్యలు తీసుకుంటున్నారని బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ తెలిపారు. గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్, సబర్మతి నగర్, అశోక్‌నగర్ బస్తీ, సౌభాగ్య అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి సోమవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం. రాకేష్‌కుమార్, నాయకులు పోతుల శ్రీకాంత్, ఆకుల శ్రీనివాస్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లేబర్‌కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాలు

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): లేబర్‌కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్-1 చైర్మన్ రాధాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, స్పెషల్ జీపీ పి. శ్రీధర్‌రెడ్డి, లేబర్‌కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రఘురామ్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి ఎం. మధుసూదన్ పాల్గొన్నారు.

కృపారావులేన్‌లో కొత్త సివరేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ కృపారావు లేన్‌లో కొత్త సివరేజీ పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సోమవారం సివరేజీ పైప్‌లైన్ ఓవర్ ఫ్లో కావడంతో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ జలమండలి సిబ్బందిని పిలిపించి సమస్యను పరిష్కరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి నూతన సివరేజీ పైప్‌లైన్ ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు.

డివిజన్లలో కార్పొరేటర్ల పర్యటన

నల్లకుంట, కాచిగూడ, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్లలో కార్పొరేటర్లు సోమవారం పర్యటించారు. నల్లకుంటలో మ్యాన్‌హోల్స్ వద్ద పేరుకుపోయిన వ్యర్థాలు, మట్టిని కార్పొరేటర్ అమృత దగ్గరుండి తొలగింపజేశారు. కాచిగూడలో కూలిపోయిన ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పరిశీలించారు. జవహర్‌నగర్ వద్ద జరుగుతున్న కచ్చా నాలా పైప్‌లైన్ పనులను గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ పరిశీలించారు. ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షం కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతను కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ జీహెచ్ఎంసీ సిబ్బందితో పూడ్చించారు.


నల్లకుంటలో మ్యాన్‌హోల్ వద్ద మట్టి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంటలో మ్యాన్‌హోల్స్ వద్ద మట్టి, వ్యర్థాల తొలగింపు

నల్లకుంట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్‌లోని రత్నానగర్, సత్యానగర్, సంజీవయ్యనగర్, భాగ్యనగర్ ప్రాంతాలలో కార్పొరేటర్ యాకర అమృత సోమవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ వద్ద పేరుకుపోయిన మట్టి, వ్యర్థాలను జీహెచ్ఎంసీ సిబ్బందితో తొలగింపజేశారు. అనంతరం రత్నానగర్‌లో హుస్సేన్‌సాగర్ నాలాను పరిశీలించారు. పరిసర ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిషోర్‌కుమార్, పాతకోట మహేష్, జీహెచ్ఎంసీ రోడ్ ప్యాచ్‌వర్క్ సూపర్‌వైజర్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.


కూలిపోయిన శ్మశాన వాటిక ప్రహరీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

పైప్‌లైన్ ఏర్పాటుతో వరదనీటి సమస్యకు పరిష్కారం

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో జవహర్‌నగర్ వద్ద జరుగుతున్న కచ్చానాలా పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వరద నీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వర్షాలతో ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, సాయిచంద్, శ్రీకాంత్, సురేష్, నవీన్‌కుమార్, సాయికుమార్, దోనేటి సత్యం, ఆనంద్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


కచ్చానాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

శ్మశాన వాటిక ప్రహరీ పునర్‌నిర్మాణానికి చర్యలు

బర్కత్‌పుర, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్ కాసీరామ్‌జీరా ప్రధాన రోడ్డుపై ఉన్న ముస్లిం శ్మశాన వాటిక ప్రహరీని పునర్‌నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి తెలిపారు. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో శ్మశాన వాటిక ప్రహరీ కూలిపోయింది. సోమవారం ఆ ప్రాంతాన్ని ఆమె సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రహరీ పునర్ నిర్మాణ పనులను చేపట్టాలని జీహెచ్ఎంసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు జహంగీర్, అమర్, మల్లికార్జున్, కృష్ణ, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కవాడిగూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ రచనశ్రీ సూచించారు. సోమవారం కవాడిగూడ డివిజన్‌లో పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. లోయర్‌ట్యాంక్‌బండ్‌లో ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వర్షం కారణంగా రోడ్డుపై ఏర్పడిన గుంతను జీహెచ్ఎంసీ సిబ్బందితో దగ్గరుండి పూడ్చించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్; కె. పరిమళ్‌కుమార్, కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


ముషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట రోడ్డుపై గుంతను పూడ్చిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

వైఎస్‌ఆర్ ఆశయాల సాధనకు కృషిచేయాలి


అన్నదానం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, ఆకుల ప్రవీణ్ తదితరులు

కవాడిగూడ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): పేదల పెన్నిది వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ, అభిమానులు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకొని కవాడిగూడ కొత్తబజార్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్, సీనియర్ నాయకుడు పిట్ల సుదర్శన్, ఆకుల ప్రవీణ్‌కుమార్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిరుపేదల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడిన వ్యక్తి వైఎస్ రాజశేఖరరెడ్డి అని అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆయన చలవేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు పోతరాజు భాస్కర్, మాజీ అధ్యక్షుడు పి. ధర్మేందర్, నగర నాయకులు సూర్య చంద్రశేఖర్, సి. శ్రీనివాస్‌గౌడ్, విశ్వనాథ్, బి. కిషన్, మునిరాం, శిల్పాచారి, రమేష్, అరుణ్‌గౌడ్, బాబురావు పాల్గొన్నారు.


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

రాంనగర్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, ప్రముఖ సినీ నటుడు పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఆయన అభిమానులు, కొణిదెల యువసేన ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్యా థియేటర్ ఆవరణలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం, దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొణిదెల యువసేన నాయకులు మోజెస్, నాగరాజు, నగేష్, విజయ్, శరత్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో అభిమానుల సందడి

పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సోమవారం గబ్బర్ సింగ్ సినిమాను విడుదల చేయడంతో ఆర్టీసీక్రాస్‌రోడ్స్‌లో సంధ్యా 35, 70, సుదర్శన్, దేవీ థియేటర్ల వద్ద ఆయన అభిమానుల సందడి నెలకొంది. నాలుగు థియేటర్లలో సినిమాను ప్రదర్శించడంతో చూడటానికి అధిక సంఖ్యలో పవన్ అభిమానులు తరలి వచ్చారు. సాయంత్రం డీజే ఏర్పాటు చేసి నృత్యాలు చేశారు. దీంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ట్రాఫిక్ జామ్ అయింది.

కల్పవృక్షం లఘుచిత్ర ప్రదర్శన


దర్శకుడు గోపాలకృష్ణను సత్కరించిన అతిథులు

రవీంద్రభారతి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కొబ్బరి దినోత్సవం సందర్భంగా కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో కల్పవృక్షం లఘుచిత్రాన్ని రవీంద్ర భారతిలో సోమవారం ప్రదర్శించారు. గోపాలకృష్ణ, రాధాకృష్ణ ప్రొడక్షన్స్‌లో జె.రాధాకృష్ణ నిర్మించిన ఈ చిత్రానికి డా. నిట్టల గోపాలకృష్ణ దర్శకత్వం వహించారు. సాలూరి వాసురావు సంగీతం అందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి సినిమా యూనిట్‌ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, సినీదర్శకుడు రేలంగి నరసింహారావు, ఎస్వీ రామారావు, మద్దాళి రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె బకాయి ఇవ్వలేదని దాడి

చిక్కడపల్లి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అద్దె ఇవ్వకుండా ఇల్లు ఖాళీ చేసిన వ్యక్తిని యజమానులు చితకబాదారు. చిక్కడపల్లి ఎస్ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి సాయిబాబా గుడి వద్ద నరేష్, చోటు సోదరుల ఇంట్లో మహ్మద్ రఫిక్(33) అద్దెకు ఉంటున్నాడు. యజమానుల సూచన మేరకు ఇంటిని ఆదివారం ఖాళీ చేశాడు. అద్దె రూ. 2 వేలు బకాయి ఉన్నాడు. అద్దె బకాయి డబ్బులు ఇవ్వకపోవడంతో ఆదివారం రాత్రి మూన్ కేఫ్ వద్ద టీకొట్టు నడుపుతున్న రఫిక్‌ను చితకబాదారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. చోటు పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీఎస్ఎన్ఎల్ కేబుల్ చోరీ ముఠా అరెస్ట్

- 200 సీసీ పుటేజీల పరిశీలన
- బైక్ నంబర్ ఆధారంగా నిందితులను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రేష్మి పెరుమాల్, అరెస్ట్ చేసిన నిందితులు (ముసుగు ధరించిన వారు)

అడ్డగుట్ట, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అండర్‌గ్రౌండ్ కేబుల్ చోరీ చేసిన ముఠా సభ్యులు 14 మందిని బోయినపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్ వివరాలు వెల్లడించారు. బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో బీఎస్ఎన్ఎల్ సంస్థకు చెందిన కాపర్ కేబుల్స్ చోరీ అవుతున్నాయని అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 200 సీసీ పుటేజీలను పరిశీలించి ఆధారాలు సేకరించారు. బైక్ నంబర్ ఆధారంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు కేబుల్ చోరీ చేస్తున్నట్లు నిర్ధారణకు వచ్చి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ. 10 లక్షల విలువ చేసే 120 కిలోల కాపర్ వైర్ల బండిల్, మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

నిందితులు వీరే..

హయత్‌నగర్‌కు చెందిన వల్లపు వినోద్(27), బందన్ వీరన్న(32), వేముల శ్రీను(22), గుంజా రాములు(23), వేముల రాజేష్(19), గోగుల వినోద్(35), వేముల ఏసు(35), వేముల నాగరాజు(26), వల్లపు వినయ్(19), వేముల సైదులు(30), గుంజా కృష్ణ(42), బంద్రి ప్రవీణ్(21), రాంబాబు(25), కె. శ్రీనివాస్(22)ను అరెస్ట్ చేశారు. కె. రమేష్(33), సత్యనారాయణ (58), మహేష్ పరారీలో ఉన్నారు.

బడి ఆవరణ.. బురదతో ఇలా..



మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ బురదమయంగా మారింది. ప్రాంగణం ఎత్తు పల్లాలుగా ఉండడంతో వర్షపు నీరు నిలిచిపోయింది.

– ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

జైపూర్-కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలులో చోరీ

- ఆదాయపన్ను అధికారి ఫోన్లు, సిల్వర్ బ్రాస్‌లెట్ అపహరణ

బర్కత్‌పుర, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఆదాయపన్ను అధికారి సెల్ ఫోన్, బ్రాస్లెట్ ఉన్న బ్యాగును దొంగలు అపహరించారు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలో నివసిస్తున్న కమల్ కుమార్ భైరవ భార్యతో కలిసి జైపూర్-కర్నూల్ ఎక్స్‌ప్రెస్ రైలును దుర్గంపూర్‌లో ఎక్కారు. రైలు కామారెడ్డి వద్దకు రాగానే అతడి భార్య బ్యాగు కనిపించలేదు. అందులో రెండు సెల్‌ఫోన్లు, ఏడు గ్రాముల సిల్వర్ బ్రాస్‌లెట్ ఉంది. సోమవారం రాత్రి రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న తర్వాత బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.


మాట్లాడుతున్న ఎంపీ డా. కె.లక్ష్మణ్

మున్నూరుకాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

రవీంద్రభారతి, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపులకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని రాజ్యసభ సభ్యుడు డా.కె. లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం రవీంద్రభారతి ప్రాంగణంలోని ఘంటసాల వేదికపై మున్నూరుకాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల పొలాలమాస, బొడ్డెమ్మ పండగ సంబురాలను నిర్వహించారు. డా.బాల శ్రీనివాస్‌పటేల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఎడ్లపొలాల అమావాస్య కాపుల సంస్కృతి అని, మున్నూరు కాపులు వ్యవసాయంలో ఉపయోగించే ఎడ్లకు స్నానం చేయించి, దానా పెట్టి గౌరవించడం ఈ పండుగ ఉద్దేశమన్నారు. మున్నూరుకాపుల ఎడ్లపొలాల అమావాస్యని రాష్ట్ర పండుగగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. ఈ పండుగ విశిష్టతను చాటుతూ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. మున్నూరుకాపు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడే కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ హనుమంతరావు, పూల రవీందర్, మాజీ ఎమ్మెల్యే లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వర్క్‌ఫ్రమ్ హోమ్ పేరుతో మోసం

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వద్ద రూ. 2.71 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్‌సిటీ, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): వర్క్‌ఫ్రమ్ హోమ్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ సైబర్ నేరగాళ్లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను మోసం చేసి రూ. 2.71 లక్షల కాజేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్‌కు చెందిన ఐటీ ఉద్యోగికి బిగ్ ఫాక్స్ అనే కంపెనీ నుంచి గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి హెచ్‌ఆర్ మేనేజర్‌గా పరిచయం చేసుకున్నాడు. తమ కంపెనీలో వర్క్‌ఫ్రం హోమ్ జాబ్స్ ఉన్నాయని చెప్పడంతో బాధితుడు అంగీకరించాడు. టెలీగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించిన సైబర్ నేరగాళ్లు.. ఇంట్లోనే ఉంటూ బిట్‌కాయిన్స్‌లో ట్రేడింగ్ చేయాలని, అతితక్కువ సమయంలో అధిక లాభాలు వస్తాయని నమ్మించారు. బిట్‌కాయిన్స్ ట్రేడింగ్ లింకును పంపించి దశలవారీగా డబ్బులు పెట్టుబడిగా పెట్టి ట్రేడింగ్ చేయాలన్నారు. బాధితుడు మొదట తక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి లాభాలను అందుకున్నాడు.

ట్రేడింగ్‌కు అలవాటుపడిన బాధితుడికి ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినట్లు చూపించారు. విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా అకౌంట్ ఫ్రీజ్ చేశారు. ఇదేంటని ప్రశ్నించగా.. నిబంధనల ప్రకారం ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చినప్పుడు 80 శాతం డబ్బులు చెల్లించాలని, లేదంటే అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయడం కుదరదని చెప్పారు. బాధితుడు రూ. 2,71,400 చెల్లించాడు. సైబర్ నేరగాళ్లు అకౌంట్ అన్‌ఫ్రీజ్ చేయకుండా ఇంకా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు సిటీసైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.